ఓం నమో భగవతే శ్రీరమణాయ

శ్రీ భారతీ దేవ్యై నమః

# ఉమాసహస్రము

## (చతుర్థ శతకమున – ప్రథమ స్తబకము)

## త్రయోదశ స్తబకము

**అవ:**- ఈస్తబకమున భగవతీకటాక్షమహిమాను వర్ణనము చేయఁబడినది. అందు మొదట పూర్వోక్తప్రకారమున హాసమును స్తుతించుచున్నాఁడు.

మూ॥ భవామ్బుధిం తారయతాద్ భవన్తం
హాసోఽద్భుతః కుఞ్జరవక్త్రమాతుః
యో హన్తి బిమ్బాధరలఙ్ఘనేఽపి
వ్యక్తాలసత్వో హరితాం తమాంసి ॥ 1

బింబఫలోపమమగు అధరోష్ఠము నతిక్రమించిననుగూడ, వ్యక్తమగు నలసతగలదియగుచు, దెసలందున్న కారుచీకటులను చీల్చుచున్నదియగు గజానన జనని – అద్భుతహాసము నన్ను – సంసారాం బుధినుండి తరింపఁజేయునుగాత!

**ప్రభ:**- బింబఫలోపమము = దొండపండుతో నుపమింపఁదగినది. వ్యక్తమగు అలసత గలది = స్పష్టమగు మందత్వముగలది. ముఖద్వారము నందున్నదియు, సమీపవర్తియునగు అధరమును అతిక్రమించినను గూడ హాసము మందమేయని భావము. ఇట్లు మిక్కిలి మందమగుచున్నను – ఉమాహాసము సర్వ దిశలందును గల తిమిరమును తొలఁగించుట యందు సమర్థమగుట వలన అద్భుతమని చెప్పఁబడినది.



ఇచట – మందహాసము – దిక్తమోహరణరూపమగు అమందమగు కార్యమును నొదవింపఁజేయుట వలన అసంభావ్యత – గమ్యమగుచున్నది. కావున నిదియ సంభవాలంకార ధ్వనియగుచున్నది. ఇందు – అద్భుతపద ముండుటవలన విశేషోక్తియని శంకింపఁగూడదు.

మూ॥ సక్తః సదా చన్ద్ర కలాకలాపే
సర్వేషు భూతేషు దయాం దధానః
గౌరీకటాక్షో రమణో మునిర్వా
మదీయమజ్ఞాన మపాకరోతు ॥ 2

చంద్రకలాకలాపునియందు, సక్తిగలదియు, ప్రాణులందఱియందును దయవహించునదియు, నగు గౌరీకటాక్షము (అపాంగదృష్టి) 'మహర్షి' అని ప్రసిద్ధుఁడగు రమణముని వలె నాయజ్ఞానమును తొలఁగించునుగాత!

**ప్రభ:**- చంద్రకలాకలాపుఁడు = చంద్రకళయే భూషణముగాఁగల శివుఁడు. చంద్రచూడుఁడు. సక్తి = ఆసక్తి లేక అనురక్తి. కటాక్షము = కడకంటిచూపు. చంద్రశేఖరునియందు సక్తి – అనురాగము వలన గౌరీకటాక్షమునందును, ఏకాంతభక్తి వలన రమణమహర్షి యందును యుక్తమగుచున్నది. **జగన్మాతకు సహజమగు సర్వభూతదయయు తత్ కటాక్షము ధరించును. సర్వప్రాణులయందునుగూడ ఆత్మదర్శనము వలన రమణమునికి గూడ భూతదయ సహజమేయగును. గురువగు రమణమహర్షి నా అజ్ఞానమును తొల గించినట్లు గౌరీకటాక్షముగూడ, నాయజ్ఞానము నపాకరించు గాతమని భావము.** అలంకారము – పూర్ణోపమ.

మూ॥ కృపావలోకో నగకన్యకాయాః
కరోతు మే నిర్మలమన్తరఙ్గమ్!
యేనాఙ్కితః శఙ్కర ఏకతత్త్వం
విశ్వంబులోకే జగతే జగౌచ ॥ 3

ఏకృపావలోకమున, అంకితుఁడగు శంకరుడు (శంకరభగవత్ పాదుఁడు) సమస్తమును – ఏకతత్త్వముగా కనుఁగొని, తన దర్శనమును లోకమున కుపదేశించెనో, ఆనగకన్యాకృపావలోకము – నాయంతరంగమును నిర్మలమొనర్చుఁగాత!

ప్రభ:- కృపావలోకము – కరుణతోడి దృష్టిపాతము, అంకితుఁడు= ముద్రింపఁబడినవాఁడు. శంకరుఁడు – ' ఆనందలహరి' మున్నగు గ్రంథములను రచించి, యంబిక నారాధించి తత్ ప్రసాదమునొంది, శారీరక (బ్రహ్మసూత్ర) భాష్యకారుఁడై యద్వైతమును బోధించిన శంకరాచార్యుఁడు.

ఏకతత్త్వముగా = అద్వితీయమగు సత్యముగా (అద్వైతముగా) కనుఁగొని = చూచి (తెలిసికొని) తన దర్శనమును = బ్రహ్మమొక్కటియే సత్యము'' అను అద్వైత జ్ఞానమును, అంతరంగమును = అంతః కరణమును, నిర్మలము = పరిశుద్ధము.

మూ॥ కాలీకటాక్షో వచనాని మహ్యాం
దదాతు మోచామద మోచనాని।
యత్ పాతపూతం రఘువంశకారం
నరాకృతిం ప్రాహురజస్యనారీమ్ ॥ 4

ఏకటాక్ష పాతము చేత– పవిత్రుఁడగు రఘువంశకారుని (కాళిదాస మహాకవిని) నరాకృతియగు సరస్వతియే యని పండితులు చెప్పుచుందురో, ఆకాలీ కటాక్షము – మోచామదమోచనములగు వచనములను నాకొసఁగుఁగాత!

ప్రభ:- నరాకృతి = మనుష్యుని యాకృతివంటి యాకృతిగలది. మోచామదమోచనములు – ఒకానొక (మంచితీపిగల) యరటిపండు యొక్క దర్పమును పోఁగొట్టునవి. ఆ యరటిపండు కంటెనుగూడ రసవత్తరములగునవి.



కాళిదాసుఁడు సరస్వతి యవతారమనియు, కాళీప్రసాద లాభమున నతఁడు మహాకవి యయ్యెననియు, ప్రాచీన పండిత ప్రోక్తమగు నైతిహ్యము ననుసరించి మీఁదియంశము చెప్పఁబడినది. కాళిదాసుని కృతులలో కుమారసంభవమను మహా కావ్యమును, సుప్రసిద్ధములగు శాకుంతలాది నాటకములును గలవు. అయినను కాళిదాసు డిచట – రఘువంశకారుఁడను పదమున నిర్దేశింపఁబడుటవలన – అద్వితీయమగు శోభగల తత్కృతులన్నిఁటి లోపలనుగూడ రఘువంశమే ప్రధానమని యీ కవి యభిమానించెనను నంశము – గుర్తింపఁదగియున్నది.

మూ॥ యుష్మాక మగ్ర్యాం వితనోతువాణీ
మేణీదృగేషా, గిరిశస్య యోషా
యస్యాః కటాక్షస్య విసారివీర్యం
గిరామయం మే వివిధో విలాసః ॥ 5

ఏ పరమేశ్వరియొక్క సర్వతః ప్రసరణశీలమగు వీర్యము – నానా విధమగు మదీయవాగ్ విలాస మగుచున్నదో, ఏణీవిలోచనయగు ఆగిరీశ్వరయోష– మీకు శ్రేష్ఠమగువాణిని విస్తరింపఁజేయుఁగాత!

ప్రభ:- వీర్యము = బలము – ప్రభావము. ఏణీవిలోచన = ఆడులేడివంటి కన్నులుగలది గిరీశ్వరయోష = పరమేశ్వర సుందరి. భగవతియగు నుమాదేవియొక్క కటాక్ష ప్రభావమే వివిధమగు నావాగ్విలాసమై యున్నదని యర్థము. మూలమునందలి వివిధపదప్రయోగము వలన – నాకవిత్వము కేవలమును ఆశుధారారూపమును, అష్టావధానాది రూపమును మాత్రమే కాదు. సర్వతోముఖమగు నాసారస్వత వైభవము – మద్విరచితములగు నిగమాగమ విమర్శనములయందును, నానాశాస్త్ర గ్రంథములయందును గూడ విభాసించుచు ధీమంతులకు సంతోషదాయక మగుచుండునను నర్థము తెలియఁదగియున్నది.

''హేతు హేతుమతో రైక్యం హేతుంకేచిత్ ప్రచక్షతే''

అనుచంద్రాలోకోక్తి వలన - ఇచట పార్వతీ కటాక్ష ప్రభావమను హేతువునకును గీర్విలాసమను హేతుమంతమునకు (కార్యమునకును) ఏకత్వము (కటాక్షబలమే - వాగ్విలాసమని) చెప్పుటవలన నిది హేత్వలంకార మగుచున్నది.

మూ॥ నగాత్మజాయాః కరుణోర్మిశాలీ
దృగన్త సన్తానధునీప్రవాహః
భీష్మేణ తప్తాన్ భవనామ కేన
గ్రీష్మేణ యుష్మాంచ్ఛిశిరీకరోతు ॥ 6

'నగరాజతనయకరుణ' అను తరంగముల చేత వెలయుచున్న కటాక్ష విస్తారమను నదీప్రవాహము - భీష్మమగు 'భవ' నామకమను గ్రీష్మము చేత తపించుచున్న మిమ్ము శిశిరీకరించుగాత!

**ప్రభ:**- భీష్మము = భయంకరము, భవనామకము = జననమను పేరుగలది (సంసారము అను పేరుగలది) గ్రీష్మము - నిదాఘము - మండువేసవి. భగవతియగు పార్వతియొక్క కరుణాపూర్ణమగు కటాక్షము. భయంకరమగు సంసారతాపమును తొలగించి మిమ్ము సుఖుల నొనర్పఁగావుతమని తాత్పర్యము. కరుణా - దృగంత సంతానమున - ఊర్మి - ధునీ ప్రవాహము లారోపితములు. భవమున - గ్రీష్మము ఆరోపితము. భీష్మమను విశేషణము - భవమునందును, గ్రీష్మము నందునుగూడ వర్తించును. తపించుట - సంసారులకు దుఃఖము చేతను, బాటసారులకు ఎండచేతను కలుగును. కావుననిది సావయవమగు రూపకాలంకారమగుచున్నది.

మూ॥ అజస్రమార్ద్రా దయయాఽన్తరఙ్గే
యథాభవో నిమ్నగయోత్తమాఙ్గే।
సన్తాపశాన్తిం భవసున్దరీ మే
కరోతు శీతేన విలోకితేన ॥ 7



భవుఁడు - ఉత్తమాంగమున గంగచేత - ఆర్ద్రుఁడగునట్లు అంతరంగమున, నెల్లపుడును దయచేత, అర్ద్రయగుచుండు భవసుందరి - శీతమగువిలోకితము చేత, నాసంతాపమును శాంతింపఁజేయుఁగాత!

**ప్రభ:**- భవుఁడు = శివుడు, ఉత్తమాంగము = శిరస్సు, ఆర్ద్రుడు = చల్లదనము గలవాఁడు. అంతరంగమున = హృదయమునందు, భవసుందరి = శివప్రియ. శివుని శీర్షమునందు = సంతతమును స్రవించుచున్న గంగ - అతని నచట నార్ద్రుని గావించునట్లు పార్వతి హృదయమునందు - సంతతమును ప్రవహించుచున్నదయ - ఆమెనచట యార్ద్ర నొనర్చుచున్నదని తాత్పర్యము. అలంకారము - ఉపమ.

మూ॥ పుణ్యాసదాపీశ్వర ఏవసక్తా
పతివ్రతా సామ్యమితా తవేక్షా
కులాచలాధీశ్వర కన్యకేమే
సంహారమంహో వితతేర్విధత్తామ్ ॥ 8

కులాద్రిరాజకన్యవగు దేవీ! నీ యీక్ష (దృష్టి) నిరంతరమును గూడ పవిత్రము, ఈశ్వరసంగవతి, కావుననే పతివ్రతతోడి సామ్యమును పొందినది. ఆదృష్టి, నాపాపవిస్తృతిని సంహరించుగాత!

**ప్రభ:**-పతివ్రత - పతికంటె నితరునియందు చలింపనట్లు, నీ దృష్టి - యీశ్వరునుడి తొలఁగదు. కావున పతివ్రతా సామ్యము నొందినదని చెప్పఁబడినది. కావున నిది యుపమాలంకార మగుచున్నది. పతివ్రత - పతికంటె నితరుని జూడకున్నను, తత్ పాతివ్రత్య ప్రభావమున పాపమును సంహరించునట్లు నీయీక్షకూడ యీశ్వరునికంటె నన్యునియందు ప్రసరింపకుండినను, పాపమును సంహరించునని భావము.

మూ॥ శర్వస్యరామే నియమేనహీనా
శ్యామా తవేషా గణికాఙ్గనేవ
నీచేఽపి మర్త్యేనిపతత్యనర్ఘా
బిభర్తినాషోడశ యః సువర్ణాన్॥ 9

ఓ శర్వసుందరీ! శ్యామయగు – నీయాక్ష – గణికాంగనవలె నియతాచారశూన్యయగుచున్నది. షోడశ – సువర్ణములను ధరించిన నీచుఁడగుమర్త్యునియందుఁగూడ – అనర్ఘమై ప్రసరించుచున్నది.

**ప్రభ:**- శ్యామ = నల్లనిది లేక సౌందర్యము గలది. షోడశ సువర్ణములను = పదునారు సంఖ్యగల అక్షరములను అనఁగా షోడశాక్షరియగు మంత్రమును, లేక పదునారు బంగారునాణెములను, అనర్ఘము = అమూల్యము = గొప్ప వెలగలది. వేశ్యాంగన – స్వర్ణధనయుక్తుఁడగు మనుష్యుఁడు నీచుడయిననుగూడ వానియందు అనురక్తయగునట్లు నీయాక్ష – షోడశాక్షర మంత్రధరుఁడగు పురుషుని యందుఁగూడ అనుగ్రహము గలది యగుచుండునని భావము. శ్లిష్టోపమ – అలంకాము.

మూ॥ పద్మాయతాక్షి! క్షితిధారికన్యే
కటాక్షనామా తవకాలసర్పః
యం సన్దశత్యేష జగత్ సమస్తమ్
విస్మృ త్యచాహో నదధాతిమోహమ్॥ 10

పద్మాయతాక్షి వగు భూదరబాలా! నీకటాక్షమను పేరుగల కాలసర్పము. ఎవనిని బాగుగకఱచునో, వాఁడు – విశ్వమునంతను విస్మరించిన వాఁడయినను మోహమును వహింపడు. ఆశ్చర్యము!



**ప్రభ:**-పద్మయతాక్షి – కమలములవలె విశాలములగు నేత్రములు గలది, మోహము = మూర్ఛ. కటాక్ష – కాలసర్పములకు – అభేదానురంజనమువలన రూపకమలంకార మగుచున్నది. మోహముకలుగుటకు కారణమున్నను, కార్యమగుమోహము కలుగనట్లు చెప్పుటవలన విశేషోక్తి యలంకారమగుచున్నది. ఆ విశేషోక్తి రూపకము చేత అనుప్రాణితము. కాలసర్పముకంటె కటాక్షము – అధికగుణమని చెప్పబడుటవలన వ్యతిరేకము గమ్యమగుచున్నది. ఇచట రూపక – విశేషోక్తులకు మాత్రము సమానమగు ప్రాధాన్యముండుట వలన నిది సమప్రధాన సంకరమగుచున్నది.

మూ॥ ఈశద్విషా శైలమహేన్ద్రకన్యే
కరోతి మైత్రీం విషమాయు ధేన
ప్రభాషతే పాతకి నశ్చపక్షే
కుతః కటాక్షోన తవాప్య ముగ్ధః॥ 11

శైలేంద్రకన్యవగు జననీ! నీకటాక్షము – ఈశ్వర ద్వేషియగు విషమాయుధునితోడి మైత్రి నొనర్చుచున్నది. పాతకియగు నతనిపక్షమున ప్రభాషించుచున్నది. కావున నది ముగ్ధము (మూఢము) కాదా!

**ప్రభ:**- విషమాయుధుఁడు = సమసంఖ్య గలవికాని అయిదు బాణములు గల మన్మధుఁడు. పాతకి = పాపముగలవాడు. పక్షము = సహాయము. ముగ్ధముకాదా= మూఢమేయగును. ప్రాణనాయకుఁడగు పరమేశ్వరుని శత్రువునకు పక్షబలమునిచ్చి పాపాత్ముఁడగువానికి సహాయమగుట వలన నీకటాక్షము మూఢమేయని భావము. ''నీ కటాక్షము పరమేశ్వర ద్వేషియందుఁగూడ పరమకారుణికము'' అనునిది స్తుతిపర్యవసాయిని యగునింద యగుచున్నది. ''ఉక్తిర్వ్యాజస్తుతి ర్నిన్దాస్తుతిభ్యాం స్తుతినిన్దయోః'' నిందచేతస్తుతియు స్తుతిచేత నిందయు చెప్పఁబడినయెడల నది వ్యాజస్తుతియగును. అనులక్షణమువలన నిది వ్యాజస్తుతియను నలంకారమగుచున్నది.

మూ॥ కృపాన్వితః కర్ణసమీపచారీ
శ్రీమాన్సదా పుణ్యజనానుకూలః
సామ్యం కురూణామధిపస్య శమ్భోః
ప్రాణప్రియే! తే భజతే కటాక్షః ॥ 12

శంభుని ప్రాణ ప్రియవగు పార్వతీ! నీ కటాక్షము - కృపాన్వితము! కర్ణసమీపచారి, శ్రీమంతము, నిత్యము, పుణ్యజనానుకూలము, అగుచు కురు దేశాధిపుఁడగుదుర్యోధనుని సాదృశ్యము నొందుచున్నది.

**ప్రభ:-** కృపాన్వితము = దయతోఁగూడినది. కర్ణసమీపచారి = శ్రోత్రాంత విశ్రాంతవము. శ్రీవంతవము = శోభగలది. పుణ్య జనానుకూలవము = పావనులకనుకూలము. దుర్యోధనుని పక్షమున మీఁది విశేషణముల యర్థమును క్రమముగా నిల్లెఱుఁగునది. ధనుర్విద్యాచార్యుఁడగు కృపునితోఁ గూడినవాఁడు, కర్ణుని సమీపముననుండువాఁడు. రాజ్యలక్ష్మీయుక్తుఁడు రాక్షసుల కనుకూలుఁడు, పవిత్రులగు జనుల కనుకూలవగు కారుణ్యవైభవము గల కటాక్షమునకు దుర్యోధనసామ్యమును వర్ణించుట విరుద్ధము. మీఁది విరోధము మీఁది విశేషణములందున్న శ్లిష్టార్థముచేత పరిహరింపఁబడినది. కావున నిది - విరోధాభాసాలంకార మగుచున్నది.

మూ॥ కర్ణాన్తికస్థోఽపిన ధర్మవైరీ
కృష్ణోఽపి మాతర్నకులం నపాతి
శీతోఽపి సన్దీపయతి స్మరాగ్నిం
హరస్యతే శైలసుతే! కటాక్షః ॥ 13

శైలకుమారివగు జననీ! నీకటాక్షము 1 కర్ణాంతికస్థము అయినను ధర్మవైరికాదు. 2 కృష్ణమయినను (కృష్ణుఁడయినను) నకులరక్షకముకాదు. 3 శీతమయినను శివునికి స్మరాగ్నిని సందీపింపఁజేయునది.



**ప్రభ:-** కర్ణాంతికస్థము = కర్ణుని సమీపమునందుండునది, లేక కర్ణముల సమీపమునందుండునది. ధర్మవైరి = ధర్మరాజునకు శత్రువు; లేక శ్రోత్రధర్మమగు శ్రవణమునకు విరోధించునది. కృష్ణము = కృష్ణరూపము, లేక నల్లనిది, న (అ) కులరక్షకము = నకులుని రక్షించునది. లేక అకులమును రక్షించునది. శీతము = చల్లనిది. స్మరాగ్నిని = కామాగ్ని. సందీపింపఁజేయునది = వృద్ధినొందించునది.

ఇందలి ప్రథమ ద్వితీయ వాక్యముల యందు శబ్దశ్లేషము చేతను, తృతీయ వాక్యము నందు - స్వభావము చేతను, విరోధ - పరిహారములు చెప్పబడుటవలన నిది విదోధాభాసాలంకార మగుచున్నది. ఇందు విరోధమున్నట్లు - ఆభాసించును (తోచును) కాని నిజమగు విరోధముండదు. కావున దీనికి విరోధాభాసమను పేరుకలిగినది.

ఇందలి ప్రథమ వాక్యమున నీ కటాక్షము - దుర్యోధనపక్షపాతియగు కర్ణుని సమీపము నందుండునది యయినను ధర్మరాజునకు విరోధికాదు అని చెప్పబడినది. కర్ణుఁడు ధర్మపుత్రునకు ప్రతిపక్షుఁడనునది ప్రసిద్ధము! కావున నిదియచట విరోధమగుచున్నది. శ్రోత్రసమీపము నందున్నను శ్రోత్రధర్మమగు వినికిని ప్రతిబంధించునది కాదు. అను నింకొక యర్థముగూడ మీఁది వాక్యమునకు గలదు. కావున నీయర్థము చేత మీఁది విరుద్ధార్థము పరిహరింపఁబడుచున్నది. ద్వితీయవాక్యమున కృష్ణరూపమయినను పాండవుఁడగు నకులుని రక్షించునది కాదు. అను నితిహాసవిరోధము కలిగినది. నల్లనిదయినను (మాలిన్యముగలదానివలెఁ గనఁబడుచున్నను) అకులమును రక్షించునది కాదని చెప్పఁబడినది. అనఁగా కులమును రక్షించునదియేయని చెప్పఁబడినది. కావున మీఁదివిరోధము నిది పరిహరించుచున్నది. ఇట్లీ రెండు వాక్యముల యందును శబ్దశ్లేషమువలన విరోధము పరిహరింపఁబడినది. తృతీయవాక్యమున చల్లనిదయినను కామాగ్నిని సందీపింపఁజేయునది అని విరోధము చెప్పఁబడినది. (చల్లనిది - అగ్ని నివృద్ధినొందించుట విర్ధముగదా! శివునికి కామాగ్నిని సందీపింపఁజేయు ప్రవృత్తి - కటాక్ష ప్రభావమునకు స్వభావసిద్ధమగుట వలన నిది పరిహరింపఁబడినది. ఇట్లు - ఇది విరోధాభాసమగుచున్నది.

మూ॥ అయంకటాక్షస్తవ తోయవాహః
కారుణ్యకాలే పరిజృమ్భమాణః
గృహేషు లీనాన్సుఖినో విహాయ
నిరాశ్రయాన్సిఞ్చతి విశ్వమాతః ॥ 14

ప్రపంచజననీ! ఈ నీ కటాక్షమను తోయవాహము – (నీటి మేఘము) కారుణ్య (వర్షా) కాలమునందంతటను వ్యాపించి, గృహములయందు లీనులగు సుఖవంతులను విడిచి – నిరాశ్రయులను సిక్తుల నొనర్చుచున్నది.

**ప్రభ:-** తోయవాహము – జలమును వహించుచున్న మేఘము. కారుణ్యకాలము = కరుణాప్రదర్శన సమయము. నిరాశ్రయులను = అనన్యాశ్రయులను, ఇతరమగు నాధారము లేనివారిని, లేక ఆవాసగృహము లేక వెలుపలనున్న వారిని గృహములయందు – భార్యలయందు, లేక నిజ గృహములయందు. లీనులు = తగులుకొనినవారు, లేక, మిగుల నడఁగియుండువారు. 'కారుణ్యకాలమునందు' అనుచోట రూపక బలమున వర్షాకాల మాక్షేపింపఁబడుచున్నది. గృహశబ్దము చేత గృహ – పుత్ర విత్తాదులు గ్రాహ్యములు. గృహ – పుత్ర – ధనాదుల నాశ్రయించి వానిచేత ఆత్మ నావరింపఁజేసికొనినవారికి – ఉచితకాలమున దేవీకరుణాకటాక్షము ఉపస్థితమయినను ఫలప్రదము కానేరదు. ఏ వస్తువును గూడ స్వకీయముగా నాశ్రయింపక నిరావరణులగువారు మాత్రమే నీ కటాక్షమున కాస్పదమగుచుందురని భావము. కటాక్ష తోయవాహములకును, కారుణ్య – వర్షాకాలములకును, అ భేదము చేనగురంజనమువలన నిది = రూపకాలంకార మగుచున్నది.

మూ॥ కస్యాపివాచా వపుషాబలేన
సమస్య సర్వైరపి యస్ని దేశాః।
అమ్భోధివేలాస్వపి నస్థలన్తి
శమ్భోః ప్రియేఽయం తవదృక్ ప్రసాదః ॥ 15



శంభుప్రియా! వాక్కుచేతను, శరీరము చేతను, బలము చేతను గూడ సర్వమానవులతోడను సమానుఁడని ఒకానొకపురుషుని శాసనములు – కల్లోలితములగు సముద్రజలములయందుఁగూడ స్ఖలితములు కాకుండుటయనునది నీదృక్ ప్రసాదము. శ్రీరాముఁడు సేతువును బంధించుట. నీ ప్రసాదము చేతనే అని భావము.

**ప్రభ:-** బలము చేత – వీర్యము చేతను – మూలమునందలి వేలాశబ్దమునకు – సముద్రజల వికారము, అనగా ఉప్పెన అని యర్థము. స్ఖలితములు = విఫలములు. దృక్ ప్రసాదము – దృష్టియొక్క అనుగ్రహము. వాక్ – శరీర – వీర్యముల చేత – తదితర మనుష్యులకు సమానుఁడగుటవలన బాహ్య దృష్టికి సాధారణునివలెఁ గనఁబడు పురుషుఁడు గూడ నీ ప్రసాదము చేత కల్లోలితములగు అధృశ్యగంభీరసాగరములను నియమించుచుండునని భావము. ఇచట – సేతుబంధాదికము నిదర్శనమైయున్నది.

మూ॥ ద్వారేషు తేషాం విచరన్తి శూరాః
సౌధేషు సారఙ్గదృశస్తరుణ్యః
ప్రగల్భవాచః కవయః సభాసు
శర్వాణితేయేషు కృపాకటాక్షః ॥ 16

శర్వాణీ! నీ కృపాకటాక్షము కలిగిన వారియొక్క – గృహద్వారముల యందు శూరులును, సౌధములయందు సారంగనయనలగు తరుణులును, సభలయందు ప్రగల్భవచనులగు కవులును విచరించుచుందురు.

**ప్రభ:-** కృపాకటాక్షము = కరుణావాహినియగు కడకంటిచూపు. సారంగనయనలు = ఆడు లేడి చూపులవంటి చూపులు గల సుందరులు, ప్రగల్భవచనులు = అతి ప్రౌఢములగు వాక్కులుగలవారు. కవులు = కావ్యబ్రహ్మలు. ఇందు శూరులగు వారు రాజులనియు, సుందరులు గలవారు శ్రీమంతులనియు, కవులుగలవారు సరసు అనియు గ్రహింపనగును. కాళివలన శౌర్యమును, లక్ష్మివలన

సంపదయు, సరస్వతి వలన విద్యయు క్రమముగా పాదత్రయము జెప్పఁబడినవి. ఈ మూడును గూడ భవత్ కటాక్షవంతుడగు పురుషుని చేత లభ్యములగునని యర్థము. ఇట్లనుటచేత – 'శర్వాణీకటాక్షము – కాళీ – లక్ష్మి – సరస్వతీ విభూతిగర్భితము' అనునంశము గమ్యమగుచున్నది.

మూ॥ యత్రాప్ను తే కోఽపి కటాక్ష లేశః
స దుర్జయః సఙ్గరసీమ్ని శూరః।
పూర్వం దివం పూరయతి ద్విషద్భి
స్తతో యశోభిర్భువ మిన్దుగౌరైః ॥ 17

అమ్మా! అనిర్వచనీయమగు నీ కటాక్షలేశము సోకిన మనుష్యుఁడు యుద్ధరంగమున దుర్జయుఁడైన శూరుఁడై మొదటస్వర్గలోకమును శత్రువీరుల చేత నిండించి, తదుపరి – భూలోకమును, సితాంశు గౌరములగు యశస్సులచేత పూరించును.

**ప్రభ:-** దుర్జయుఁడు = మిక్కిలి శ్రమచేత గాని జయించుటకు వీలుకాని వాఁడు. సితాంశు గౌరములు = చంద్రునివలె శుభ్రములు. (తెల్లనివి) కటాక్షవంతుఁడగు జనునికి మహోన్నత శౌర్యప్రాప్తి ప్రస్తావము చేత కటాక్షమునకు గల కాళీ విభూతి చెప్పఁబడినది. మొదట శత్రువులను స్వర్గమునొందించుటయు, తరువాత భూమిని శుభ్రకీర్తుల చేత పూరించుటయు, నిచటఁ జెప్పఁబడటవలన ఇది కార్యము యొక్క శీఘ్రతా ప్రత్యాయనార్థమగు అతిశయోక్త్యలంకార మగుచున్నది.

మూ॥ యంతారకాకాన్త కలాపకాన్తే!
నలోకసేకోఽపి నలోకతేతమ్
యంలోకసేతేన విలోకితోఽపి
శ్రియం సమృద్ధాం సముపైతిలోకః ॥ 18



చంద్రకలాభూషణుఁడగు శివుని కాంతవగు భగవతీ! నీవు చూడని వానినెవ్వఁడును గూడ చూడఁడు. (వాడు పేరు లేనివాఁడయి, సర్వజనుల చేతను గూడ నుపేక్షింపఁబడును.) నీ వెవ్వనిని విలోకింతువో వానిచేత విలోకింపఁబడినవాఁడుకూడ సమృద్ధమగు సంపదనొందును.

**ప్రభ:-** సమృద్ధము = పుష్కలము. నీ దృష్టి సంపర్కము సాక్షాత్తుగాను, పరపరగాను కూడ లోకులకుఁ గలుగుచుండును. కావున నీ దృష్టినాశ్రయించినవాని నాశ్రయించినవారికిఁగూడ పుష్కలమగు శ్రీ విభూతి కలుగునని భావము. దీని చేత కటాక్షమునకు గల లక్ష్మీ విభూతి ప్రస్తుతింపఁబడినది.

మూ॥ సుధాంహసన్తీ మధుచాక్షిపన్తీ
యశోహరన్తీ వనితాధరస్య
పరిష్కరోత్యస్య కవిత్వధారా
ముఖం హరప్రేయసి! లోకసేయమ్ ॥ 19

శివప్రేయసీ! నీవు – ఎవనిని వీక్షింతువో, వాని ముఖమును – అమృతము నపహసించునదియు, మధువు నాక్షేపించునదియు, వనితల యధరోష్ఠమునకుఁగల కీర్తిని గూడ నపహరించునదియునగు కవిత్వధార పరిష్కరించును.

**ప్రభ:-** మధువు = తేనె, కవిత్వధార = కావ్యసంపాతము. ఆక్షేపించునది = నిషేధించునది, పరిష్కరించును = అలంకరించును. కవిత్వధార – అమృతముకంటెను గూడ నధికమగు నిజోత్కర్షము వలన అమృతమును జూచి నవ్వుననియు, ''సుందరుల కెమ్మోవి – లోభనీయమును శ్రేష్ఠమును అగు మాధుర్యముగలది'' అని యధరమునకుఁగల కీర్తినిగూడ నపహరించుననియు, భావము. దీనిచేత ''కటాక్షము సరస్వతీ విభూతిమంతము'' అనునంశము చెప్పఁబడినది. హసించుట – ఆక్షేపించుట– అపహరించుట – ఉపమావాచకములని యింతకుముందే చెప్పఁబడినవి. ఇందు – ఒక్కటియేయగు కవితాధార కనేకములగు నుపమానములు కాన్పించుటవలన మాలోపమాలంకారమగుచున్నది.

మూ॥ సర్వేన్ద్రియానన్దకరీ పురన్ధ్రీ
విద్యానవద్యా విపులాచలక్ష్మీః।
ఇయం త్రిరత్నీ పురుషస్యయస్య
దుర్గే! త్వయా దృష్టమిమంతు విద్మః ॥ 20

దుర్గాదేవి! సర్వేంద్రియానందకరియగు పురంధ్రియు, అనవద్యయగు విద్యయు, విపులయగు లక్ష్మియు, అను నీత్రిరత్ని - ఎవనికిఁ గలదో, ఆ పురుషుని నీచేత అవలోకితుఁడని ఎఱుఁగుదుము.

ప్రభ:- సర్వేంద్రియానందకరి = భోగసాధనములగు నింద్రియములకు సమ్మదముఁగూర్చునది. పురంధ్రి = సర్వలక్షణ సంపన్న శరీరాంతరంగములు గలదియగు రమణి. అనవద్య = నిర్దుష్ట. విపుల = బహుల. త్రిరత్ని = మూడురత్నముల కలయిక (రత్నములనఁగా శ్రేష్ఠవస్తువులని యర్థము) అవలోకితుఁడు = బాగుగాఁ జూడఁబడిన వాఁడు. త్వదీయ కరుణాకటాక్షము లేనియెడల ఏయొక్కనికి గూడ నీమూడును లభింపవని భావము.

మూ॥ ముధాక్షి పస్యద్రినుతే! కటాక్షా
కైలాసకాన్తార మహీరుహేషు
ఇతః కిరేషత్ తవనాస్తిహానిః,
సిధ్యత్యభీష్టంచ సమస్తమస్య ॥ 21

అమ్మా! పర్వతపుత్రీ! కైలాసకాంతారమహీరుహముల యందు నీదృగంతదృష్టుల నేలవ్యర్థముగా విరియఁజిమ్మెదవు? ఇక్కడ వానినించుక ప్రసరింపఁజేయుము, (తన్మూలమున) నీకు హానిలేదు - (సరిగదా) ఈ వ్యక్తి యొక్క యభీష్టమంతయును సిద్ధించును.

ప్రభ:- కైలాస ప్రాంతమునందలి యరణ్యమునందున్న వృక్షములయందుఁ బ్రసరించి, నీకటాక్షములు వ్యర్థములగుచున్నవి. నీవు నాయందాకటాక్షములను



కొంచెముగనైనను ప్రసరింపఁజేయుము. తత్ కటాక్షపాతమున నీకేమియు నష్టము లేదు కాని నాకు గొప్పలాభమున్నది. కావున యాచించుచున్నానని తాత్పర్యము.

మూ॥ శీతాచలాధీశకుమారి! శీతః
సంరక్షణే సంశ్రితమానవానామ్
దుర్ధర్ష దుష్టాసురమర్దనేషు
నితాన్త ముష్ణశ్చ తవావలోకః ॥ 22

శీతాచలాధీశ్వరకుమారీ! నీయవలోకనము - సంశ్రితమానవ సంరక్షణమునందు శీతలమును (దయార్ద్రమును) దుర్ధర్ష - దుష్టాసుర మర్దనములందు, మిగుల నుష్ణమును (తాపమునిచ్చునదియు) అగుచున్నది.

ప్రభ:- దుర్ధర్ష- దుష్టాసుర మర్దనములయందు - దుర్జయులును దుష్టులును అగురాక్షసులను మర్దించుటయందు. శీతలము = చల్లనిది. ఉష్ణము = వెచ్చనిది. నిమిత్తభేదము వలన - ఒక్కటియేయగు దృష్టిపాతము - శీతలమును, ఉష్ణమును గూడ నగుచున్నదని యర్థము. ఇట్లు ఒకే వస్తువును ద్వివిధముగా నుల్లేఖించుటవలననిది ఉల్లేఖాలంకారమగుచున్నది.

మూ॥ రుషాసమేతం విదధాతినాశం
కరోతి పోషం కృపయా సనాథమ్
అమ్బౌషధస్యేవ తవేక్షితస్య
యోగస్యభేదేన గుణస్య భేదః ॥ 23

జననీ! రుషాసమేతమగు నీ యీక్షితము - నాశమును కృపా సనాథమగు నీయీక్షితము - పోషమును గావించుచున్నది. ఔషధయోగము యొక్క భేదము చేత (వాత, పిత్త, కఫ, నాశాది) గుణము భేదించునట్లు నీయీక్షితయోగము యొక్క భేదము చేత (వినాశాది) గుణము భేదించును.

ప్రభ:- రుషాసమేతము = కోపముతో (గూడినది. కృపాసనాథము = దయతో గూడినది. ఈక్షితము - చూపు. (దృష్టిపాతము) యోగము = ప్రమాణవేదాదులచేత సాధింప(దగిన వస్తువిశేషముల కలయిక, లేక కోపాదులతోడి సంబంధము. గుణము = వాత పిత్త కఫములను పోగొట్టుట మున్నగునది, లేక నశింపజేయుట మున్నగునది. నీయీక్షితము - రోషయోగముచేత, వినాశము నొనర్చును. కృపాయోగము చేత, పోషము నొనర్చును అను నీయర్థమును - 'యోగ విశేషము చేత గుణభేదమువలె' అనునుపమ చమత్కరించు చున్నది.'' ఇందలి యోగ - గుణ - శబ్దములు శ్లిష్టార్థములు.

మూ॥ నాశాయతుల్యోద్ధతకామలోభ
క్రోధత్రిదోషస్య భవామయస్య
శివప్రియే! వీక్షిత భేషజంతే
క్రీణాని భక్త్యావదభోః కియత్యా ॥ 24

శివప్రియవగు దేవీ! సమోర్ధతములగు (సమానముగా గర్వించునవియగు) కామ - క్రోధ - లోభములనెడి త్రిదోషములు (అన(గా, వాత పిత్త కఫములు) గల జన్మమను రోగమునకు, నీవీక్షితమను భేషజమును ఎంతభక్తితో కొన(గలనో చెప్పుమా!

**ప్రభ:**- ఉద్ధతములు = గర్వించినవి, ప్రకోపించినవి. వీక్షితమను భేషజము = నీదృష్టి పాతమను మందు ఎంత భక్తిమూల్యమునిచ్చిన నీవీక్షితౌషధము లభించునో చెప్పుమని భావము. సమానముగా నుద్ధతములగు కామ - క్రోధ - లోభములు - తుల్యమగు ధాతుప్రకోపము స్వరూపముగా(గల సన్నిపాతములో(గూడిన (వాత, పిత్త, కఫలములను) త్రిదోషములుగను, జన్మము - రోగముగను, వీక్షితము - ఔషధముగను భక్తి - మూల్యము( (వెల) గను చెప్ప(బడుటవలన నిది సావయవతాద్రూప్య రూపకాలంకార మగుచున్నది.



మూ॥ అభిష్టుతాం చారణసిద్ధసఙ్ఘైః
త్రిష్టుబ్విశేషా అపిమర్త్యశూనోః
కృపాకటాక్షైర్వినతాన్ పునానాం
కపర్దినః సమ్మదయన్తు కాన్తామ్ ॥ 25

మానవపుత్రునిచే రచింప(బడిన త్రిష్టుప్ ఛందః ప్రస్తారగతములగు వృత్త విశేషములు గూడ - చారణసిద్ధ - సంఘముల చేత - అభి - స్తుతయగుచు వినతులగు ఆశ్రితులను పవిత్రీకరించుచున్న శివకాంతను ఆనందింప(జేయు(గాత!

**ప్రభ:**- చారణాదులు దేవతలలో నొకతెగకు సంబంధించిన వారు - వినతలు- ప్రణతులు. ఈ స్తబకమున - ఉపజాతి వృత్తములను ఉపేంద్రవజ్రావృత్తములును నిబంధింప(బడినవి. ఇవి రెండును గూడ, త్రిష్టుప్ ఛందస్సును ప్రస్తరించుట వలన నేర్పడుచున్నది. కావుననే మూలమున ''త్రిష్టుబ్విశేషాః'' త్రిష్టుప్ ఛందమునందలి భిన్నవృత్తములని చెప్ప(బడినవి. పాదమునకు పదునొకటి యక్షరములు గల ఛందమునకు త్రిష్టుప్పను పేరుగలదు. పాదపాదమునకును గూడ మీ(ది సంఖ్యగల యక్షరములచే శ్రవణరంజకములగుచున్న యీ వృత్తములు రెండునుగూడ త్రిష్టుప్ ఛందమున నుదయించినవి. కావున నివి త్రిష్టుప్ ఛందః ప్రస్తారగతములగు వృత్త విశేషములని చెప్ప(బడినవి. పరమేశ్వరి - దేవ విశేషులగు చారణాదుల చేత లెస్సగా స్తుతింప(దగినది. నేను మనుష్యు(డను. అయినను యీత్రిష్టుప్ వృత్తముల చేత(గూడ నామె స్తుతింప(బడి యానందింపక పోదను దృఢ విశ్వాసముచే నీయాశంస కావింప(బడినది.

సవ్యాఖ్యమగు త్రయోదశస్తబకము సమాప్తము.

* * * *